సూర్య 18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శనివారం
30-08-2025
పేజీలు: 02



## భారత్‌తో చర్చలకు సిద్ధం.. పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్

భారత్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు దాయాది పాకిస్థాన్ మరోసారి ప్రకటించింది. కశ్మీర్ సహా అన్ని సమస్యల పరిష్కారానికి న్యూఢిల్లీతో గౌరవప్రదమైన చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు పాక్ విదేశాంగ మంత్రి, ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ.. 'జమ్ము కశ్మీర్ వివాదం సహా అన్ని సమస్యల పరిష్కారానికి భారత్‌తో గౌరవప్రదమైన రీతిలో చర్చలు జరిపేందుకు పాక్ సిద్ధంగా ఉంది' అని తెలిపారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత తోక ముడిచిన పాక్.. అనేక సార్లు కాళ్ల బేరానికి వచ్చింది. న్యూఢిల్లీతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎప్పటికప్పుడు ప్రకటిస్తూ వస్తోంది. అయితే, భారత్ మాత్రం పాక్ అభ్యర్థనను తిరస్కరిస్తూ వస్తోంది. ఉగ్రవాదం, చర్చలు రెండూ ఏకకాలంలో ఉండవని వెల్లడించింది. ఆ దేశంతో చర్చలు జరిగితే కేవలం ఉగ్రవాదం, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)పైనే ఉంటాయని స్పష్టం చేస్తోంది.



## జ్వరేవ్, గాఫ్ ముందుకు

ప్రతిష్ఠాత్మకమైన యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వరేవ్ (జర్మనీ), 8వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా) రెండో రౌండ్‌లో విజయం సాధించారు. మహిళల సింగిల్స్‌లో అమెరికాకు చెందిన మూడో సీడ్ కొకొ గాఫ్, 8వ అమందా అనిసిమోవాలు మూడో రౌండ్‌లో ప్రవేశించారు. ఆస్ట్రేలియా క్రీడాకారిణి డారియా కసట్కినా, జాక్వెలిన్ క్రిస్టియన్ (రుమేనియా)లు కూడా రెండో రౌండ్‌లో జయకేతనం ఎగుర వేశారు. అగ్రశ్రేణి క్రీడాకారిణి కొకొ గాఫ్ రెండో రౌండ్‌లో క్రొయేషియాకు చెందిన డొనా వెకిక్‌ను ఓడించింది. ఆసక్తికరంగా సాగిన పోరులో గాఫ్ 76, 62తో వెకిక్‌ను ఓడించింది. తొలి సెట్‌లో పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. ఇటు గాఫ్ అటు వెకిక్ ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డారు. దీంతో పోరు టైబ్రేకర్ వరకు వెళ్లక తప్పలేదు. అయితే ఇందులో చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో సఫలమైన గాఫ్ సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో మాత్రం గాఫ్‌కు ప్రత్యర్థి నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురు కాలేదు. గాఫ్ ఈ సెట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. వెకిక్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ అలవోకగా సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచి ముందంజ వేసింది. అనిసిమోవా కూడా మూడో రౌండ్‌కు చేరుకుంది.



## 15 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి..

# కేటీఆర్ డిమాండ్

నేడు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై భారత రాష్ట్ర సమితి వినూత్న నిరసన చేపట్టింది. ఇందులో భాగంగా కనీసం 15 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆయన గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు.. అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజులు లేదా అంతకు మించి నిర్వహించినా తాము సిద్ధమే అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశాన్ని సభలో పెట్టినా.. అన్నింటికీ సరైన సమాధానం ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ విస్తీర్ణంతో పాటు వ్యవసాయ సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కార్యక్రమాలు, పథకాల గురించి వివరిస్తామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. మరి ఎందుకు ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పలను లైన్లో పెట్టడం, ఆధార్ కార్డులను లైన్లో పెట్టే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు..? పండుగ రోజు కూడా రైతులు ఎరువుల కోసం లైన్లలో నిలబడి, వర్షంలో తడిసి ఇబ్బందులు పడే దుస్థితి ఎందుకు వచ్చిందని ధ్వజమెత్తారు. పంట నష్టపోయిన రైతుల గురించి కానీ, భారీ వర్షాల వల్ల ఇబ్బందుల గురించి గానీ సుదీర్ఘంగా చర్చించే అవకాశం అసెంబ్లీలో ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ సంక్షోభం పైన అసెంబ్లీలో చర్చ పెట్టాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 600కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 75 లక్షల మంది రైతులు ఈరోజు అవస్థలు పడుతున్నారని చెప్పకొచ్చారు. రైతులకు కాంగ్రెస్ చేసిన మోసంపైన అసెంబ్లీలో చర్చ జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల నుంచి 420 హామీల అమలు వైఫల్యాల దాకా అన్ని అంశాల పైన చర్చిద్దామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వాటి పైన కూడా చర్చ జరగాలని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉండే ఒకటి రెండు అంశాల పైననే మాట్లాడే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్రజల కష్టాలు, సమస్యలపైన చర్చలకు అసెంబ్లీ వేదిక కావాలని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరంతో పాటు అన్ని అంశాలపైన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అది పీసీ గోష్ కమిషన్ కాదు, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ గోష్ కమిషన్ అని ఎద్దేవా చేశారు. దానిపైన కూడా కాంగ్రెస్ పార్టీకి సమాధానం చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

### యూరియా కోసం ధర్నా.. బీఆర్ఎస్ నేతలు అరెస్ట్

రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలంటూ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయా పోలీసు స్టేషన్లకు వారిని తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అంతకుముందు వ్యవసాయ శాఖ కమిషనర్‌కు యూరియా కొరతపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వినతిపత్రం అందించారు. యూరియా కొరత తీర్చాలని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు సూచించారు. మేం రాజకీయాలు చేయడం లేదు.. రైతుల తరపున మాట్లాడుతున్నాం అని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టింది ఈ ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. "గణపతి బప్పా మోరియా — కావాలయ్యా యూరియా" అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. "రేవంత్ దోషం — రైతన్నకు మోసం" అంటూ నినాదాలు చేశారు.



## నన్ను చంపితే డబ్బు ఎవరు ఇస్తారో పోలీసులు తేల్చాలి: కోటంరెడ్డి

తుది శ్వాస వరకు ప్రజలకు సేవ చేస్తానని, ఎవరి బెదిరింపులకు బయపడనని నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎను చంపేస్తే డబ్బే డబ్బు అని కొందరు రౌడీషీటర్లు మాట్లాడుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోటంరెడ్డి మీడియాతో సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం తన మిత్రుడు వీడియో పంపితే చూసి షాక్ గురయ్యానని చెప్పారు. ఎస్ పి మూడు రోజుల ముందు నుంచే సమాచారం ఉందని, తనకు ఎందుకు చెప్పలేదని నిలదీశారు. పోలీసులు తనని ఎందుకు అప్రమత్తం చేయలేదని కోటంరెడ్డి అడిగారు. ఎమ్మెల్యేగా కాదు.. పౌరుడిగా అడుగుతున్నానని, తనని చంపితే డబ్బే డబ్బు అని వీడియోలో మాట్లాడారని, తనని చంపితే డబ్బు ఎవరు ఇస్తారో పోలీసులు తేల్చాలని ప్రశ్నించారు. వైఎస్ఆర్ సిపికి తాను ప్రత్యర్థిగా ఉన్నానని, వైసిపి నేతలు ఎందుకు భుజాలు తడుముకుంటున్నారని మండిపడ్డారు. తన తమ్ముడే కుట్ర చేశాడని ఆరోపణలు చేయడం సరికాదని, అధికారం కోసం సొంత వాళ్లను హతమార్చే డిఎన్ఎ మాది కాదు అని, ఇలాంటి బెదిరింపులకు భయపడనని కోటంరెడ్డి వివరణ ఇచ్చారు. ఎంఎల్ఎ కోటంరెడ్డి కార్యాలయం దగ్గర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కోటంరెడ్డి ఆఫీస్‌కు టిడిపి శ్రేణులు భారీగా చేరుకున్నాయి. ఎస్పి, పోలీసులకు వ్యతిరేకంగా టిడిపి శ్రేణుల నినాదాలు చేశారు. అరాచకశక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ఇండస్ట్రీలో ఆయనే నా గురువు..

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీగా ఉంది. ఏ మాయ చేశావే సినిమాతో ఇండస్ట్రీలోకి పరిచయం అయ్యింది సమంత. ఆ తర్వాత తక్కువ సమయంలోనే ఈ చిన్నది స్టార్‌గా మారిపోయింది. దాదాపు అందరు స్టార్ హీరోల సినిమాల్లో నటించి మెప్పించింది. తెలుగు, తమిళ్ భాషల్లో సూపర్ హిట్ సినిమాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చిన్నది. సమంత, నాగ చైతన్యను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత మనస్పర్థల కారణంగా విడిపోయారు. ఇక విడిపోయిన తర్వాత సమంత, నాగ చైతన్య ఎవరి లైఫ్‌లో వారు బిజీగా ఉన్నారు. ఇదిలా ఉంటే సమంత మాయోసైటిస్ కారణంగా ఏడాది పాటు సినిమాలకు బ్రేక్ తీసుకుంది. ఇక ఇప్పుడు తిరిగి సినిమాల్లో నటించడానికి రెడీ అవుతుంది. ఇటీవలే నిర్మతగా మారి సినిమా చేసింది. శుభం అనే సినిమాతో నిర్మాతగా మారింది సామ్. అలాగే ఇప్పుడు తెలుగు, హిందీ, తమిళ్ లో సినిమాలు చేస్తుంది.ఇదిలా ఉంటే సమంత గతంలో చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు నెట్టింట మరోసారి వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ లో తనకు ఓ స్టార్ హీరో గురువు అని తెలిపింది సామ్. టాలీవుడ్ లో సమంత చాలా మంది స్టార్ హీరోల సరసన నటించింది. మహేష్ బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్ ఇలా చాలా మంది స్టార్ హీరోలతో నటించింది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తోనూ సినిమా చేసింది సమంత.



## కామారెడ్డిలో వర్ష బీభత్సం రోడ్లు కొట్టుకుపోయిన దృశ్యాలు!

కామారెడ్డి జిల్లాలో కురిసిన అతి భారీ వర్షాలు విపత్తుగా మారాయి. చాలా ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, రైల్వే మార్గాలు నీట మునిగిపోయాయి. జాతీయ రహదారి 44 సహా అనేక కీలక రహదారులు పెద్దఎత్తున దెబ్బతినడంతో రవాణా పూర్తిగా నిలిచిపోయింది.వర్షాల ధాటికి వేలాది మంది ఇళ్లలో, హాస్టళ్లలో చిక్కుకుపోయారు. రెస్క్యూ బృందాలు అప్రమత్తమై వందలాదిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. అయితే, ఈ వరదల్లో కొంతమంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం.పోచారం ప్రాజెక్ట్ వంటి పాత నీటినిల్వ నిర్మాణాలు భారీ వరదను తట్టుకుని నిలవడం కొంతవరకు ఉపశమనం కలిగించింది. ఇక వరద తగ్గిన తర్వాత కామారెడ్డి పట్టణం ప్రస్తుత దుస్థితిని వివరంగా చూపే డ్రోన్ దృశ్యాలు ఇప్పుడు బయటకు వచ్చాయి. ఆ విపత్కర పరిస్థితిని ఈ చిత్రాల ద్వారా మీరు కూడా చూడవచ్చు.



## వర్షాల వలలో తెలంగాణ రైతులు.. పంటపై భారీ నష్టం

తెలంగాణలో భారీ వర్షాల కారణంగా 270 మండలాలు మరియు 2,463 గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. వర్షాలు కారణంగా వరి, పత్తి, మొక్కజొన్న, టమాట, కంది వంటి పంటలకు భారీ నష్టం ఎదురైనట్లు తెలిపారు.ప్రాథమిక అంచనా ప్రకారం, మొత్తం 2,20,443 ఎకరాల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. దీనిపై జిల్లాల వారీగా పంట నష్ట నివేదికను ప్రభుత్వానికి సమర్పించామని కూడా వెల్లడించారు.నివేదికలో పేర్కొనబడినట్లుగా, వరికి 1,09,626 ఎకరాలు, పత్తికి 60,080 ఎకరాలు, సోయాబీన్‌కు 6,751 ఎకరాలు, మరియు ఉద్యాన పంటలకు 639 ఎకరాల మేర తీవ్ర నష్టం వాటిల్లింది.

## ఆస్పత్రిలో రౌండ్స్ వేస్తుండగా.. గుండెపోటుతో కార్డియాక్ సర్జన్ మృతి

ఇటీవల గుండెపోటు మరణాలు భయంకరంగా పెరుగుతున్నాయి. శారీరకంగా ఫిట్‌గా కనిపించే యువకులు, ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేనివారు సైతం ఒక్కసారిగా హార్ట్‌అటాక్‌తో కుప్పకూలిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా అలాంటి దారుణమే చెన్నైలో చోటుచేసుకుంది. చెన్నైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కార్డియాక్ సర్జన్‌గా పనిచేస్తున్న డా. గ్రాడ్లిన్ రాయ్ (39) బుధవారం విధుల్లో ఉన్న సమయంలోనే గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రి వార్డుల్లో రౌండ్స్ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే తోటి వైద్యులు అత్యవసర చికిత్స ప్రారంభించినప్పటికీ ఆయనను కాపాడలేకపోయారు. కార్డియాలజీపై లోతైన అవగాహన ఉన్న, ఎప్పుడూ జాగ్రత్తలు పాటించే ఒక కార్డియాక్ సర్జన్.. గుండెపోటుతోనే మృతి చెందడం వైద్య వర్గాలను షాక్‌కు గురి చేసింది. యువతలో పెరుగుతున్న హార్ట్‌అటాక్ కేసులకు ప్రధాన కారణాలు ఒత్తిడి, ఎక్కువసేపు పని చేయడం, అనారోగ్యకర జీవనశైలి అని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు నిద్ర, రెస్ట్ లేకుండా డబుల్ షిఫ్ట్‌లలో పని చేయడంతో గుండెమీద తీవ్ర ఒత్తిడి పడుతుందంటున్నారు. అలాగే వ్యాయామం లేకపోవడం, ఆహారం తినే వేళల్లో మార్పులు, టెన్షన్‌తో కూడిన జీవనశైలి కూడా హార్ట్‌అటాక్స్‌కు దారితీస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



EVENING EDITION
శనివారం | 30 ఆగస్టు 2025 4PM
www.suryaa.com
సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com



# పింఛన్ల పంపిణీలో ఆలస్యానికి చెక్.... మంత్రి సీతక్క కీలక ప్రకటన

ప్రజల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని తెలంగాణ ప్రభుత్వం చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పథకంను అమలు చేస్తోంది. ఈ పథకం లక్ష్యం ఆర్థికంగా బలహీన వర్గాలకు భరోసా ఇవ్వడం. ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, హెచ్ఐవీ బాధితులు, డయాలసిస్ రోగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు వంటి అనేక వర్గాలకు ఈ పింఛన్లు ఒక ఆశ్రయం లాంటివి. ప్రస్తుతం మొత్తం పదకొండు రకాల పింఛన్లు ఈ పథకం కింద అందజేస్తున్నారు. అయితే పింఛన్ దారులు డబ్బులు అందజేసే క్రమంలో వారి ఫింగర్ ప్రింట్ తీసుకునేందుకు ఇప్పటి వరకు 2జీ ఆధారిత ఫింగర్ ప్రింట్లను వాడేవారు. దీంతో అటు సిగ్నల్ రాక.. ఇటు ఫింగర్ ప్రింట్ సరిగ్గా పడక.. కూలి పనులు చేసే వారు, శారీరకంగా బలహీనులు, రోగులు వంటి వారికి పింఛన్ పొందడంలో అనేక సమస్యలు ఎదురయ్యేవి. ఈ ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిష్కారాన్ని ప్రవేశపెట్టింది. ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్ ద్వారా ఇప్పుడు ధృవీకరణ జరగనుంది. దీని వలన 'సరైన వ్యక్తికి — సరైన పింఛన్ — సరైన సమయంలో' అందేలా ఒక పారదర్శక విధానం అమల్లోకి వస్తోంది. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.15.50 కోట్ల బడ్జెట్ కేటాయించి.. 5G ఆధారిత L1 ఫింగర్ ప్రింట్ పరికరాలు, స్మార్ట్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 6,300 బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు పరికరాలు పంపిణీ చేయనున్నారు. ములుగు జిల్లా పస్రా కేంద్రంలో మంత్రి సీతక్క , కలెక్టర్ టీఎస్ దివాకర్ కలిసి ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పోస్టుమాస్టర్లకు పరికరాలు చేరనున్నాయి. ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి బాధ్యతను TG Online చేపట్టింది. నూతన టెక్నాలజీ వల్ల ధృవీకరణ ప్రక్రియ కేవలం మూడు సెకన్లలో పూర్తవుతుంది. ఇక లబ్ధిదారులు పొడవాటి క్యూల్లో గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా.. తక్షణమే పింఛన్లు పొందగలుగుతారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈ కొత్త విధానం పింఛన్ పంపిణీ వ్యవస్థను డిజిటల్ రూపాంతరం చేస్తుందని తెలిపారు. ఇది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా.. ప్రభుత్వ పథకాలపై నమ్మకం పెంపొందించనుందని అన్నారు. పింఛన్‌దారుల సమస్యలను అర్థం చేసుకొని ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో పింఛన్ పొందడం ఒక పెద్ద సవాలుగా ఉండేది. అయితే ఆధునిక సాంకేతికత వినియోగంతో పింఛన్ దారులు ఇక ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డిజిటల్ రూపాంతరంతో ప్రభుత్వం తీసుకున్న ఈ అడుగు.. భవిష్యత్తులో ఇతర సంక్షేమ పథకాలకూ మార్గదర్శకంగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# జమ్ము కశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్.. 11 మంది మృతి

ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఢిల్లీతోపాటూ ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, జమ్ము కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు ఎక్కడికక్కడ వరదలు సంభవిస్తున్నాయి. తాజాగా జమ్ము కశ్మీర్‌లో మరోసారి క్లౌడ్‌బరస్ట్ సంభవించింది. రాంబన్, రియాసి జిల్లాలో మేఘవిస్ఫోటనం కారణంగా భారీ వర్షం కురిసింది. ఈ కుండపోత వర్షానికి వరదలు సంభవించాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డారు. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గల్లంతయ్యారు. రియాసి జిల్లాలోని మహోరె ప్రాంతంలో ఓ ఇంటిపై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ ఇంట్లోని కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోయింది. నజీర్ అహ్మద్ (38), ఆయన భార్య, ఐదుగురు పిల్లలు శిథిలాల కింద చిక్కుకుని మరణించారు. రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు వారి మృతదేహాలను శిథిలాల కింద నుంచి బయటకు తీశారు. రాంబన్ జిల్లాలోని రాజ్‌ఘడ్ విలేజ్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా ఓ పాఠశాలను వరద ముంచెత్తింది. ఈ వరదకు ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో నలుగురి మృతదేహాలను రెస్క్యూ టీమ్ గుర్తించింది. గల్లంతైన వారి కోసం గాలింపు చేపడుతోంది. మరోవైపు గ్రామంలో కొండచరియలు కూడా విరిగిపడ్డాయి. దీంతో అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి.



# పంజాబ్‌లో వరదలు.. 23 మంది మృతి

పంజాబ్‌లో భీకర వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వరదలు సంభవించాయి. వరదల్లో కనీసం 23 మంది మరణించారు. సుమారు వెయ్యి గ్రామాలు వాననీటిలో మునిగిపోయాయి. వరద ప్రభావిత జిల్లాల నుంచి సుమారు 16వేల మందిని రక్షించారు. వరద నష్టాన్ని అంచనా వేస్తున్న ఆమ్ ఆద్మీ ప్రభుత్వం.. నీటి మునిగిన ప్రాంతాలకు రిలీఫ్ మెటీరియల్‌ను పంపిస్తోంది. పఠాన్‌కోట్‌లో 8 మంది, హోషియార్‌పూర్‌లో ఏడు, రూప్‌నగర్, బార్నాలాలో మూడేసి మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని రావి, బియాస్, సట్లెజ్ నదులు ఉప్పొంగి ప్రవాహిస్తున్నాయి. వరద పరిస్థితిని సమీక్షించేందుకు సీఎం భగవంత్ మాన్ సింగ్ ప్రత్యేక మీటింగ్ నిర్వహించారు. గురుదాస్‌పూర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, తరన్ తారన్, కపుర్తలా, హోషియాపూర్, ఫిరోజ్‌పూర్, ఫాజిల్కా పట్టణాల్లో ప్రత్యేక సహాయ చర్యలు చేపట్టారు. రిలీఫ్, రెస్క్యూ ఆపరేషన్స్ పర్యవేక్షించేందుకు హై పవర్ కమిటీని ఏర్పాటు చేశారు.



# హైడ్రాను ప్రశంసించిన హైకోర్టు

హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలు, రహదారి ఆక్రమణలు, పార్కులు, నీటి వనరులపై దాడులు చాలా కాలంగా ఒక పెద్ద సమస్యగానే ఉన్నాయి. ఈ క్రమంలో హైడ్రా ఏర్పాటు కావడంతో పరిస్థితులు మారాయి. గతంలో పెద్ద నాయకులు, రాజకీయ ప్రోత్సాహం ఉన్నవారు ఆక్రమణలు చేసినా.. సాధారణ ప్రజలు ఏం చేయలేని స్థితి నెలకొనేది. కానీ హైడ్రా ముందుకు రావడంతో ఇప్పుడు ప్రజల్లో ధైర్యం పెరిగింది. తాజాగా పర్యావరణహితమైన నగరంగా హైదరాబాద్ను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న హైడ్రాను హైకోర్టు అభినందించింది. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, రహదారులు, పార్కులను కాపాడేందుకు హైడ్రా వంటి సంస్థలు అవసరముందని పేర్కొంది. రహదారులపై రాకపోకలకు ఆటంకంగా నిర్మించిన వాటిని తొలగించే విషయంలో హైడ్రా అవసరముందంటూ జస్టిస్ విజయశేన్ రెడ్డి వాఖ్యానించారు. రాంనగర్ మనెమ్మ గల్లీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ రోడ్డు ఆక్రమణపై జీహెచ్ఎంసీకి గతంలో ఫిర్యాదు చేసింది. హైడ్రా సహకారాన్ని జీహెచ్ఎంసీ కోరింది. దీంతో హైడ్రా రంగంలోకి దిగి.. జమినిస్తాన్పూర్, రామ్ నగర్ క్రాస్ రోడ్స్లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని హైడ్రా తొలగించింది. దీంతో రామ్ నగర్ ప్రధాన రహదారికి వెళ్లేందుకు అవకాశం లభించింది. అయితే ఈ విషయమై.. రోడ్డుపై వాణిజ్య సముదాయాన్ని నిర్మించిన వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు గురువారం విచారణకు రాగా.. జస్టిస్ విజయశేన్ రెడ్డిపై విధంగా వ్యాఖ్యానించారు. రహదారులను ఆక్రమించేసి రాకపోకలకు ఆటంకం కలిగించే నిర్మాణాలను తొలగించడంలో HYDRAA వంటి సంస్థలు ముఖ్యమైనవని హైకోర్టు పేర్కొంది. ఎప్పుడైనా ప్రజా ప్రయోజనాలకు లోబడి ప్రైవేట్ ప్రయోజనాలు ఉండాలని కూడా హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రజా ఆస్తులు, నీటి వనరులను కాపాడడంలో నగరం అంతటా HYDRAA చేస్తున్న కార్యక్రమాలను హైకోర్టు ప్రశంసించింది. హైదరాబాద్‌లో అనధికారిక భవనాలు పెరగడంతో వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ అవుతోంది. చిన్న చిన్న గల్లీలు మూసుకుపోవడం వల్ల అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సమయానికి గమ్యానికి చేరడంలో ఆటంకం కలుగుతోంది. అదనంగా.. భూగర్భ జలాలు తగ్గిపోవడం, చెరువులు మాయం కావడం కూడా ఈ అక్రమ కట్టడాల వలన జరుగుతోందని నిపుణులు సూచిస్తున్నారు. రాంనగర్ ఘటనలో హైకోర్టు తీర్పు హైడ్రా చర్యలకు పెద్ద బలాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి అక్రమ కట్టడాలపై హైడ్రా తీసుకునే చర్యలకు ఇది చట్టపరమైన రక్షణగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడానికి న్యూ ట్రిక్

తెలంగాణ రాష్ట్రంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలను పెంచారు. వాహనదారుడు మితిమీరిన వేగంతో వెళ్లడం, సిగ్నల్ జంపింగ్ వంటి తప్పిదాలకు పోలీసులు నేరుగా జరిమానాలు విధిస్తున్నారు. అయితే.. కొంతమంది వాహనదారులు ఈ చలాన్లను తప్పించుకోవడానికి వింత పద్ధతులు అవలంబిస్తున్నారు. వాహన నంబర్ ప్లేట్లను మార్చడం.. వాటిలో నుంచి ఒక అంకె తొలగించడం.. వాటి స్థానంలో రాజకీయ నినాదాలు లేదా నేతల పేర్లు రాయడం లాంటి పనులు చేస్తున్నారు. పట్టుబడినపుడు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక మరికొందరు నంబర్ స్పష్టంగా కనిపించకుండా పేపర్ అంటించడం, మట్టి రాసేయడం, వెనక్కి తిరిగి కాళ్లు పెట్టడం లేదా చేతులు కప్పేయడం వంటి ప్రమాదకర చర్యలకు కూడా వెళ్తున్నారు. ఈ ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో వాహనం ఒక్కసారిగా బ్యాలెన్స్ తప్పి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక నంబర్‌లో సగ భాగం మాత్రమే కనిపించేలా దాచేస్తే పోలీసులు వెతికినా యజమాని ఎవరో కనుక్కోలేని స్థితి వస్తోంది. ఇలాంటి పనులకు పాల్పడుతూ చాలా మంది ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకుంటున్నారు. కొత్త వాహనం కొన్నప్పుడు మొదట తాత్కాలిక టీఆర్ నంబర్ వస్తుంది. నెలలో శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. కానీ కొందరు ఏళ్ల తరబడి టీఆర్ నంబర్‌తోనే వాడుతున్నారు. ఈ టీఆర్ నంబర్ ద్వారా అయితే చలాన్లు విధించే అవకాశం ఉండదు అనే కారణంగా ఇలాంటి పనులు చేస్తున్నారు.



అయితే ఇలాంటి వారిని పోలీసులు గుర్తించినప్పుడు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల బాన్సువాడలో పెద్ద మోసం బయటపడింది. హైదరాబాద్ నుంచి దొంగతనం చేసిన వాహనాలను తక్కువ ధరకు స్థానికులకు అమ్మేశారు. సరైన పత్రాలు లేకపోయినా చవకైన ధరకు వాహనం వస్తుందని నమ్మిన వారు మోసపోయారు. తనిఖీల్లో ఆ వాహనాలు పట్టుబడటంతో పోలీసులు అసలు కథ బయటపెట్టారు. అధికారులు ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ.. పత్రాలు సరిగా లేని వాహనాలు కొనకూడదని సూచించారు. బాన్సువాడ సీఐ అశోక్ మాట్లాడుతూ.. వాహనాల తనిఖీలు కఠినంగా కొనసాగుతున్నాయి.. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు తప్పవు.. పత్రాలు లేకుంటే వాహనం స్వాధీనం చేసుకుంటాం.. నంబర్ తప్పు అయితే నేరుగా కేసు నమోదు చేస్తా అని స్పష్టం చేశారు. ఎక్కువగా ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉంటే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

# స్కూళ్లు, కాలేజీల్లో ఫేషియల్ రికగ్నిషన్ హాజరుకు సీఎం ఆదేశం

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కొత్త విధానం ద్వారా హాజరు శాతం మెరుగుపడటంతో పాటు, వృత్తి విద్యా సంస్థల్లోని లోపాలను సరిదిద్దవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.శుక్రవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్నిచోట్లా మౌలిక వసతులను మెరుగుపరిచి, మెరుగైన బోధనా సౌకర్యాలు కల్పించాలని సూచించారు.విద్యాశాఖ పరిధిలో అదనపు తరగతి గదులు, వంటశాలలు, టాయిలెట్లు, ప్రహరీ గోడల నిర్మాణ పనులను వేర్వేరు ఏజెన్సీలకు అప్పగించడం సరైన పద్ధతి కాదని సీఎం అన్నారు. నాణ్యత, పర్యవేక్షణ, నిధుల వినియోగంలో పారదర్శకత కోసం ఈ నిర్మాణ పనులన్నింటినీ ఒకే విభాగానికి అప్పగించాలని ఆదేశించారు. ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కే ఈ బాధ్యతలు అప్పగించాలని ఆయన తేల్చిచెప్పారు.మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను గ్రీన్ ఛానెల్ ద్వారా తక్షణమే క్లియర్ చేయాలని సీఎం అధికారులను




ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని హెచ్చరించారు. అదేవిధంగా, 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కింద చేపట్టిన పారిశుద్ధ్య పనుల బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, వంట కోసం సోలార్ ప్యానెళ్లతో కూడిన కంటైనర్ కిచెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని పునరుద్ఘాటించిన సీఎం, అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లను నియమించుకోవాలని తెలిపారు. సంక్షేమ గురుకులాల్లోని బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించడంపైనా సమావేశంలో చర్చించారు. విద్యా రంగంపై చేసే ఖర్చును పెట్టుబడిగా భావించాలని సీఎం అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ౯౦ శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులే చదువుతున్నందున, గత 10 ఏళ్లలో చదివిన వారి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు.



# ఇద్దరు చెల్లెల్లని పెళ్లాతానంటూ టవరెక్కిన అల్లుడు!

ఓ వ్యక్తికి నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే భార్య ఏడాది తర్వాత అనారోగ్యంతో కన్నుమూసింది. దీంతో సదరు పతిదేవుడు.. చనిపోయిన భార్య ఇద్దరు చెల్లెల్లలో ఒకరిని పెళ్లి చేసుకున్నాడు. ఆనక చివరి మరదలిని కూడా పెళ్లాడతానని పట్టుబట్టాడు. అత్తమామలు ఒప్పకోకపోవడంతో దగ్గర్లోని ఓ హై-వోల్టేజ్ విద్యుత్ టవర్ ఎక్కి పెళ్లి చేస్తారా..? చావమంటారా? అని నానాయాగి చేశాడు. ఈ షాకింగ్ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజ్ సక్సేనా అనే వ్యక్తి 2021లో ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. అయితే ఆమె అనారోగ్య కారణాల వల్ల ఏడాది తిరకగక ముందే చనిపోయింది. దీంతో రాజ్ సక్సేనా సోదరిని పెళ్లి చేసుకున్నాడు. రెండేళ్ల తర్వాత అతగాడు భార్య చివరి చెల్లెలిపై మనసుపడ్డాడు. ఈ విషయం భార్యకు గురువారం ఉదయం తెలిపాడు. చిన్న మరదలును పెళ్లి చేసుకుని ఆమెకు కూడా మంచి భవిష్యత్తు ఇస్తానని వగలుపోయాడు. చిర్రెత్తుకొచ్చిన భార్య ససేమిరా అని తెగేసి చెప్పింది. అయితే సదరు మొగుడు గారు చిన్న మరదలిని తనకు ఇచ్చి పెళ్లి చేస్తారా? లేదా? అంటూ భీష్మించాడు. బాలీవుడ్ మువీ 'షోలే'లోని సీన్‌ని పెళ్లి కోసం వాడేశాడు. చకచకా వెళ్లి దగ్గర్లోని హై-ఓల్టేజ్ విద్యుత్ టవర్ ఎక్కి మరదలితో పెళ్లి జరిపించాలని డిమాండ్ చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు, కుటుంబ సభ్యులు అతన్ని ఒప్పించే ప్రయత్నం చేశారు. సుమారు ఏడు గంటల పాటు హైడ్రామా నడిపించాడు. చివరకు చేసేదిలేక చిన్న మరదల్ని ఇచ్చి పెళ్లి చేస్తామని హామీ ఇవ్వడంతో అలకమాని టవర్ దిగి వచ్చాడు. చిన్న మరదలు కూడా తనను ప్రేమిస్తుందని చెప్పడం విశేషం.




# ప్లాన్ వర్కవుట్ అవుతుందా?

టైటిల్‌కు తగ్గట్లే ఉప్పెనలా ఇండస్ట్రీకి దూసుకొచ్చిన బ్యూటీ కృతి శెట్టి. ఏం జరిగిందో తెలుసుకుని తేరుకునేలోపే ఉప్పెన, శ్యామ్ సింగరాయ్, బంగార్రాజుతో దెబ్బకు గోల్డెన్ లెగ్ అయిపోయింది. కానీ అంతలోనే టైమ్ టర్న్ అయింది.. వరసగా ఫ్లాపులొచ్చాయి. మాచర్ల నియోజకవర్గం, వారియర్, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, కస్టడీ, మనమే ఫ్లాపులతో కృతి శెట్టి రేంజ్ ఒక్కసారిగా పడిపోయింది.తెలుగులో కృతికి ఆఫర్స్ నిల్.. ఇక్కడ మనమే తర్వాత పూర్తిగా ఖాళీ అయిపోయారు. ఇదే సమయంలో తమిళ, మలయాళం నుంచి మాత్రం ఈమెకు ఆఫర్స్ బాగానే వస్తున్నాయి.మలయాళంలో ARM సినిమాతో బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన కృతి.. తమిళంలోనూ కార్తి, జయం రవి, ప్రదీప్ రంగనాథన్ లాంటి హీరోలతో నటిస్తున్నారు.ఒకప్పుడు సోషల్ మీడియాలో మాత్రమే గ్లామర్ షో చేసిన కృతి శెట్టి... ఇప్పుడు సినిమాల్లోనూ మొదలు పెట్టారు.విఘ్నేష్ శివన్ తెరకెక్కిస్తున్న LIKలో కృతి గ్లామర్ ప్రధానాకర్షణ. అలాగే వా వాతియార్‌లోనూ ఫుల్లుగా అందాలను ఆరబోస్తున్నారు బేబమ్మ.